క్లుప్తంగా

గ్యాస్ ధరలు తగ్గించాలి



పెనమలూరు: పెంచిన గ్యాస్, పాల ధరలు వెంటనే తగ్గించాలని తాడిగడప మున్సిపాలిటీ సీపీఎం కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి డిమాండ్ చేశారు. పోరంకి మానికొండ సుబ్బారావు, సూర్యవతి గార్ల కార్మిక కార్యాలయం వద్ద వంట గ్యాస్ బండలు, పాలప్యాకెట్లతో నిరసన వ్యక్తం చేశారు. త్రిమూర్తి మాట్లాడుతూ కేంద్ర ఘత్వం వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచుకుంటూ పోతుందన్నారు. నేతలు షేక్.కాశిం, ఎస్కే.మస్తాన్‌వలి, గోపిరెడ్డి నరసయ్య, ఉయ్యూరు సందీప్, పాతాళ లక్ష్మి, వీసం రమణమ్మ, భవాని, కోటేశ్వరమ్మ, దాసరి రమణమ్మ, ఎం.దివ్య పలువురు పాల్గొన్నారు.

ఉపవాస ప్రార్థనలు ప్రారంభం



పెనమలూరు: కానూరు కార్మెల్‌మాత పుణ్యక్షేత్రంలో ఉపవాస ప్రార్థనలు చేశారు. విచారణ గురువులు ఎం.బాలస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి తపఃకాల ఆరాధన, ఏసు క్రీస్తు అనుభవించిన శ్రమలు, 14 స్థలాల ప్రార్థనలు జరిపారు. ఫాదర్ ఉడుముల బాలశౌరి ఉపవాస ప్రార్థనలు ప్రారంభించారు. పవిత్రమైన దివ్య పూజాబలిని ఫాదర్లు బాలశౌరి, బాలస్వామి, రాయప్ప, ప్రశాంత్, పృథ్వీ సమర్పించి భక్తులందరికి దివ్య ప్రసాదం అందజేశారు. గంగూరు, పోరంకి, కామయ్యతోపు, కానూరు నుంచి భక్తులు వచ్చి పాల్గొన్నారు. భక్తు ఆరాధన పాటలు ఆలపించారు. సెయింట్ థెరిస్సా సిస్టర్లు,దీక్షపరులు, ఉపదేశకులు, భక్తులు పాల్గొన్నారు.

పరిశోధనారంగంపై దృష్టి పెట్టాలి



పెనమలూరు: విద్యార్థులు పరిశోధన రంగంపై దృష్టి పెట్టాలని ఇస్రో విశ్రాంత ఇంజినీర్ శ్రీరామమూర్తి అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన విద్యార్థులకు సైన్స్, విజ్ఞానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అబ్దుల్‌కలాం ఆశయాలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవాని, శాస్త్రవేత్త శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దంతాల సంరక్షణపై అవగాహన

గన్నవరం రూరల్: దంతాలను సంరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరిలో అవగాహన అవసరమని సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు, పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు చెప్పారు. శనివారం చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో కన్జర్వేటివ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త పిలుపు మేరకు కన్జర్వేటివ్ రూట్ కెనాల్ చికిత్సా దినోత్సవం జరిగింది. హెచ్‌వోడీ టి.రాంబాబు అధ్యక్షతన హెచ్‌వోడీలు డాక్టర్ రవిచంద్రశేఖర్, అజయ్ బెనర్జీ, సురేష్, సునీల్ చంద్ర, కోటేశ్వరరావు, కిరణ్, నాయుడు, ప్రభాత్ పాల్గొన్నారు.

1050 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు పూర్తి

ఉయ్యూరు: మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీ పాఠశాలలో చేపట్టిన కంటి పరీక్షల శిబిరం శనివారంతో ముగిసింది. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ విద్య అభ్యసిస్తున్న 1050 మంది విద్యార్థులకు ఆఫ్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు నిర్వహించారు. 29 మంది విద్యార్థులకు దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థకు కళ్లజోళ్ల కోసం సిఫారసు చేశారు. హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడి లేని విద్యతో మనోవికాసం

పెనమలూరు: ఒత్తిడిలేని విద్యా విధానం మనోవికాసానికి దోహదపడుతుందని ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ ఎస్.దుర్గశ్రీలక్ష్మి అన్నారు. పోరంకిలోని భాష్యం బ్లూమ్స్ ప్రథమ వార్షికోత్సవం శనివారం విద్యా సంస్థల ముఖ్య సలహాదారుడు మైఖేల్‌రాజ్ అధ్యక్షతన జరిగింది. ప్రముఖకొరియోగ్రాఫర్ రఘుమాస్టార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధన ఉండాలన్నారు. భాష్యం చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ 15 బ్రాంచీలతో ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన అందిస్తున్నామన్నారు. చిన్నారులు డ్యాన్స్ ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. భాష్యం డైరెక్టర్ హనుమంతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో అభివృద్ధి జెండా..

- అభివృద్ధి పథంలో హనుమాన్ జంక్షన్
- రూ.15 కోట్లతో పనులు
- ప్రజాప్రతినిధులు, నేతల కృషి ఫలితం



హనుమాన్‌జంక్షన్‌లో నిర్మాణ దశలో ఆర్టీసీ బస్టాండ్



నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: అభివృద్ధి పథంలో హనుమాన్‌జంక్షన్ పట్టణం శరవేగంగా అడుగులు వేస్తోంది. గడిచిన మూడున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

అనుకూలతలు ఇవీ..

కృష్ణా, ఏలూరు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన హనుమాన్‌జంక్షన్ 16వ నంబర్ జాతీయ రహదారి, 216 హెచ్ జాతీయ రహదారుల కూడలి ప్రాంతం. రైల్వే రవణా సదుపాయాలు కలిగి ఉండటం, గన్నవరం విమానాశ్రయానికి సమీపంలో ఉండటంతో పారిశ్రామికంగానూ దూసుకువెళ్లుతోంది. జిల్లాలో ప్రాధాన్యత కలిగిన హనుమాన్‌జంక్షన్‌లో రూ.15 కోట్ల వ్యయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి.

రూ.4.40 కోట్లతో ఇంటిగ్రేటెడ్ బస్టాండ్..

హనుమాన్‌జంక్షన్‌లోని ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు సమూలంగా మారిపోతున్నాయి. 1966లో నిర్మించిన ప్రస్తుత బస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరగా రూ.4.40 కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. హైవేకు అనుకుని ఉన్న 20,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో వ్యాపార, వాణిజ్య సముదాయం ఏర్పాటు చేయనున్నారు.

రూ.1.40 కోట్లతో పీహెచ్‌సీ భవనం..

స్థానిక మహాత్మగాంధీ నగర్‌లో రూ.1.40 కోట్ల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవన నిర్మాణం వేగంగా జరుగుతుంది. 24 గంటల వైద్య సేవల ఆస్పత్రిగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధమవుతోంది.

రూ.1.30 కోట్లతో నాడు–నేడు..

స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌ను రూ.1.30 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. పూర్తిగా ప్రభుత్వ నిధులతో కార్పొరేట్ హంగులకు మించి జెడ్పీ హైస్కూల్‌లో అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాలను కల్పించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన మనబడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో నాబార్డు సాయంతో రూ. 80 లక్షలతో 8 తరగతి గదులు, టాయిలెట్లు నిర్మాణం చేయగా, రెండో విడతలో రూ.50 లక్షల వ్యయంతో డిజిటల్ తరగతి గది, విద్యార్థులు కూర్చునేందుకు బల్లలు, తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు, గ్రీన్ బోర్డులు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. కాగా, ప్రభుత్వం 2022–23 విద్యా సంవత్సరం నుంచి బాలికల జూనియర్ కళాశాలను కూడా ప్రారంభించింది.

రూ.2.04 కోట్లతో సెంట్రల్ లైటింగ్..

హనుమాన్‌జంక్షన్‌లోని ప్రధాన రహదారుల్లో రూ.2.04 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఆరు కిలోమీటర్లు మేర సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే ఎన్‌హెచ్‌ఏఐ ఈ మేరకు చర్యలు చేట్టింది. ఒక్కో విద్యుత్ స్తంభం మధ్య 40 మీటర్ల దూరంతో మొత్తం 150 స్తంభాలు ఏర్పాటు చేయనున్నారు. రోడ్డు మరమ్మతులు చేయటంతో పాటుగా రూ.25.78 లక్షల వ్యయంతో ప్రధాన రహదారుల మధ్యలో డివైడర్‌పై స్టీల్ రైలింగ్ నిర్మించనున్నారు. హనుమాన్‌జంక్షన్‌లో అస్తవ్యస్తంగా మారిన డ్రెయినేజీ వ్యవస్థను సమూలంగా మార్పు చేసేందుకు ఎన్‌హెచ్‌ఏఐ రూ.81.50 లక్షలతో ప్రణాళిక చేపట్టింది.

రూ.2.8 కోట్లతో కేడీసీసీబీ భవనం..

రూ.2.8 కోట్లతో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్‌కు త్వరలో కొత్త భవనం ఏర్పాటు కానుంది. దీని కోసం ఇటీవల విజయవాడ రోడ్డులో రూ.1.53 కోట్ల వ్యయంతో 17.50 సెంట్ల స్థలాన్ని కేడీసీసీబీ కొనుగోలు చేసింది. మరో రూ.1.27 కోట్ల వ్యయంతో నూతన భవన నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

క్షయవ్యాధిపై విద్యార్థులకు అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు క్షయ వ్యాధి నివారణ, నిర్మూలనపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ క్షయ నిర్మూలన ప్రోగ్రాం కింద రే ఆఫ్ హోప్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కానుమోలు ఆరోగ్య ఉప కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాజ్‌మూన్ పఠాన్ మాట్లాడుతూ క్షయ వ్యాధి గాలిద్వారా సోకే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు, నెలకు రూ.500 ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. రే ఆఫ్ హోప్ సర్వీస్ సొసైటీ ప్రతినిధి టి.మురళీ మాట్లాడుతూ 2025 నాటికి క్షయవ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేపట్టిందని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.లూథర్ పాల్, హెల్త్ సూపర్‌వైజర్ టి.శాంత కుమారి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అన్నసమారాధన

పెనమలూరు: పోరంకి శ్రీనివాసానగర్‌లో శ్రీషిరిడి సాయిబాబా 28వ వార్షికోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 5 గంటలకు బాబాకు కాగడ హారతి, మంగళస్నానం, దోనేపూడి దుర్గాప్రసాద్ దంపతులచే 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం చేశారు. తుమ్మలపల్లి హరికృష్ణ దంపతులు పళ్ల రసాలతో అభిషేకం, సురేష్ కుమార్ దంపతులు మారేడు, తులసి దళాలతో విశేష పూజలు చేశారు. యుగంధర్ దంపతులు అన్నాభిషేకం, జి.రమేష్‌బాబు దంపతులు గులాబీ పూలతో పూజలు చేశారు. బాబా పాదుకా ఉత్సవం తరువాత దాదాపు 20 వేల మంది భక్తులను అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ చైర్మన్ మున్నంగి అర్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్తమ సేవలతో ప్రజల మన్ననలు



సత్కారం పొందిన ఉత్తమ సిబ్బందితో ఈఈ రాంబొట్లు

ఉయ్యూరు: ఉత్తమ సేవలు అందించినవారే ప్రజల మన్ననలు పొందుతారని విద్యుత్ శాఖ ఉయ్యూరు డివిజన్ ఈఈ సీహెచ్ రాంబొట్లు అన్నారు. స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో లైన్‌మెన్ దివస్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బెస్ట్ లైన్‌మెన్‌గా రాజు, బెస్ట్ అసిస్టెంట్ లైన్‌మెన్‌గా రవిబాబు, బెస్ట్ జూనియర్ లైన్‌మెన్‌గా కిషోర్‌కు అవార్డులు అందించి సత్కరించారు. ఈఈ రాంబొట్లు మాట్లాడుతూ బాధ్యతాయుత పనితీరే గుర్తింపు తెస్తుందన్నారు. ఉయ్యూరు, అవనిగడ్డ డీఈలు రామకృష్ణ, సుబ్రమణ్యేశ్వరరావు, ఏఈ నాగమల్లేశ్వరరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మందుల పంపిణీ

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కానూరు ఆయుర్వేద వైద్య శాఖ వైద్యురాలు కె.రాగలత మాట్లాడుతూ పెదపులిపాకలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరంలో మోకాలి నొప్పులతో బాధపడుతున్న వృద్ధులకు మందులు, ఆయిల్ ఉచితంగా ఇచ్చామన్నారు. గ్యాస్, దగ్గు మందుతో పాటు చిన్నారులకు బలం మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం జ్యోతి, కంపౌండర్ మూర్తి, వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతే లక్ష్యం



కార్మికులకు సాయం అందజేస్తున్న కేసీపీ యూనిట్ హెడ్ సీతారామదాసు

ఉయ్యూరు: భద్రతా ప్రమాణాలు పాటిస్తూ కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కేసీపీ యూనిట్ హెడ్ వై.సీతారామదాసు అన్నారు. స్థానిక కర్మాగారంలో కేసీపీ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వెలగపూడి రామకృష్ణ 127వ జయంతి, 52వ జాతీయ భద్రతా దినోత్సవం శనివారం నిర్వహించారు. వెలగపూడి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం భద్రతా దినోత్సవం సందర్భంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగ, కార్మికులను సత్కరించి అవార్డులను ప్రదానం చేశారు. 10 మంది కార్మికులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందించారు. పున్నారావు, సీకే వసంతరావు, సంపత్‌కుమార్, చంద్రబాబు, వెంకటేశ్వరరావు, రత్నప్రసాద్, ప్రసాద్‌రెడ్డి, సయ్యద్ అనిస్, సంక్షేమ అధికారి మీర్జా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధన

నున్న(విజయవాడరూరల్): జయేంద్ర సరస్వతి స్వామి 5వ ఆరాధన చినకంచి మహాక్షేత్రంలో శనివారం వైభవంగా జరిగింది. కంచికామకోటి పీఠాన్ని అధిష్టించిన 69వ ఆచార్యులైన జయేంద్ర సరస్వతి స్వామికి నున్న గ్రామంలోని చినకంచి మహాక్షేత్రం పట్ల ఆదరాభిమానాలు ఉండేవని ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలిపారు. ఆయన విగ్రహాన్ని ఇటీవల ప్రతిష్టించామని తెలిపారు. తొలుత ఆయన విగ్రహానికి పంచామృతాలతో రుద్రం పఠిస్తూ అభిషేకం చేశారు. ఉపనిషత్తుల పారాయణం జరిగింది. వేద విద్యార్థులు, వేదపాఠశాల గురువు ఇనుగంటి పవన్‌కుమార్‌శర్మ, విష్ణుభొట్ల జగన్నాథ ఘనపాఠి, మత్తూరు రాఘవ ఘనపాఠి, కంభంపాటి ఆంజనేయ ఘనపాఠి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదముల వితరణ జరిగింది.

ప్రకృతి వైపరీత్యాల సమయంలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నంది

రామవరప్పాడు: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ పింటు నంది అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్డీఆర్‌ఎఫ్ బృందం ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో అవలంభించే జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నంది మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు సమయస్ఫూర్తిని ప్రదర్శించి బయటపడాలని, తోటి వారికి సహాయం చేయాలన్నారు. ఏఎస్‌ఐ బీఎస్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

42 మందికి వైద్య పరీక్షలు

రామవరప్పాడు: రూరల్ మండలం గూడవల్లిలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం సచివాలయం–1లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యురాలు కె.సునీత 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ శిబిరంలో కీళ్లవాతం, గ్యాస్ ట్రబుల్, దగ్గు, జలుబు, చర్మవ్యాధులను పరీక్షించారు. రక్త హీనతపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ సముద్రవేణి, సిబ్బంది కోటేశ్వరరావు, డి.ప్రదీప్, యోగ టీచర్లు స్వాతి, జగదీశ్ పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో ఉజ్వల భవిష్యత్

రామవరప్పాడు: ఫార్మసీ రంగంలో ఉజ్వల భవిష్యత్ ఉందని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ సూర్యదేవర విద్యాధర అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న విజయ మహిళ ఫార్మసీ కళాశాలలో శనివారం 2022వ సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన బీ ఫార్మసీ, ఫార్మాడీ, ఎంఫార్మసీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాపట్ల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల కృష్ణమూర్తి మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఎస్సార్కే ఫౌండేషన్ సెక్రటరి శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ కె.పద్మలత, పలు విభాగాధిపతులు, డాక్టర్ వెంకటేశ్వరరావు, పురుషోత్తమ రెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

నేడు ఓటు నమోదుకు అవకాశం

గన్నవరం: కొత్త ఓటర్లు నమోదు, మార్పులు, చేర్పులు, ఓటర్ కార్డుకు అనుసంధానం నిమిత్తం ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి బీ చంద్రలీల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఓటర్‌గా నమోదు, మార్పులు, చేర్పులు, ఓటర్ కార్డుకు ఆధార్‌గాని, ఇతర గుర్తింపు కార్డుతో అనుసంధానం కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళకు గాయాలు

పెనమలూరు: గంగూరు గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న మహిళను బైక్ ఢీ కొట్టడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సిద్ధాబత్తుల ఉషారాణి విజయవాడ నుంచి గుడివాడకు ఆటోలో కుమారుడితో బయలుదేరింది. ఆమె గంగూరు వద్దకు రాగా స్పిన్నింగ్ మిల్లు సమీపంలో నర్సరీ కనబడటంతో ఆటో ఆపి రోడ్డు దాటుతుండగా ఆమెను విజయవాడ నుంచి కంకిపాడు వైపునకు వెళుతున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు గాయాలు అవటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పీహెచ్‌సీ అభివృద్ధిపై సమీక్ష

ఉంగుటూరు: రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందజేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి నాడు–నేడు ద్వారా పీహెచ్‌సీలను అభివృద్ధి చేస్తోందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. ఇందుపల్లి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా మండలంలో రెండు పీహెచ్‌సీల అభివృద్ధికి రూ.1.80 కోట్లు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. భవన నిర్మాణంలో జాప్యానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులు మంజూరులో పెండిగ్ బిల్లులపై చర్చించి పలు సూచనలు చేశారు. సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు, వైద్య అధికారులు బి.శిరీష, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఎమ్మెల్యే వంశీ సాయం



బీఫార్మసీ విద్యార్థికి సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సేవాదృక్పథం అభినందనీయమని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన బీఫార్మసీ విద్యార్థి శీలం గౌతమ్ సోనీకి రూ.30 వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే వంశీ అందించారు. కళాశాల ఫీజు చెల్లించేందుకు సాయం చేయాలని ఇటీవల ఎమ్మెల్యే వంశీని ఆశ్రయించాడు. దీంతో స్పందించిన ఆయన రూ.30 వేలు సాయం అందించారు. భవిష్యత్‌లోనూ ఉన్నత చదువులకు తన ప్రోత్సాహం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ మొత్తాన్ని శనివారం వేలేరులో జరిగిన కార్యక్రమంలో గాంధీ, శేషగిరిరావు చేతుల మీదగా విద్యార్థి తల్లిదండ్రులకు అందజేశారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి నిర్మల, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, వైఎస్సార్ సీపీ నాయకులు గూడవల్లి రత్న సుధాకర్, కోడెబోయిన బాబి, రాయి శివ పార్వతి పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జయలక్ష్మి

గన్నవరం: చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మహిళా వారోత్సవాల్లో భాగంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ..మహిళల హక్కుల రక్షణ, భద్రత కోసం పలు చట్టాలు అమలులో ఉన్నాయని చెప్పారు. వీటికి భంగం కలిగినప్పుడు మహిళలు నేరుగా పోలీసులను, కోర్టులను ఆశ్రయించవచ్చని తెలిపారు. పేద వర్గాలకు చెందిన మహిళలకు ఉచితంగా న్యాయ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీ శిరీష, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ దాసరి భాగ్యలక్ష్మి, న్యాయవాదులు విమల్‌కుమార్, క్లెవ్ తదితరులు పాల్గొన్నారు.

నవ ధాన్యాల సాగుతో భూమి సారవంతం



విత్తన గుళికలు తయారు చేసే విధానం వివరిస్తున్న ఎస్‌డీఏ సులోచన

ఎస్‌డీఏ సులోచన

గన్నవరం రూరల్: ఖాళీగా భూమిని ఉంచటం వల్ల సూర్య కిరణాలు నేరుగా భూమిని తాకి సూక్ష్మ పోషకాలు దెబ్బతింటాయని, వాటిని రక్షించేందుకు, భూమిని సారవంతం చేసేందుకు నవధాన్యాలు సాగు చేయాలని ఎస్‌డీఏ (సబ్ డివిజనల్ యాంకర్) సులోచన పేర్కొన్నారు. దీని వల్ల పశువులకు బలమైన గ్రాసం, భూమికి పోషకాలు లభిస్తాయన్నారు. నవధాన్యాలు విత్తన గుళికలుగా తయారు చేసే ప్రక్రియను సిబ్బంది రైతులకు ప్రదర్శించి చూపించారు. శనివారం స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన ర్యాలీ వీరపనేనిగూడెం సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బండి నాగసాంబిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి పద్మావతి, ఎల్–2 సీహెచ్ గణేశ్వరమ్మ, ఐసీఆర్‌పీలు జె.వెంకమ్మ, తుమ్మల రాయప్ప, వివోఏ డి.మంజువాణి, పలువురు ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

'స్పందన' దరఖాస్తుపై చర్యలు



పాతపాడు గ్రామంలో పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ జాహ్నవి

పాతపాడు(విజయవాడరూరల్): స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అధికార యంత్రాంగం సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. నున్న గ్రామానికి చెందిన అవుతు సత్యవతి పాతపాడు గ్రామంలో ఆర్‌ఎస్ నంబర్ 88/1బీలో 90 సెంట్లు ఉండాల్సిన వ్యవసాయ భూమికి 74 సెంట్లు మాత్రమే ఉందని సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీ పెట్టారు. అర్జీలో పేర్కొన్న సమస్య పరిష్కరించేదిశగా శనివారం పాతపాడు గ్రామంలో ఆ పొలంలో కొలతలను మండల తహసీల్దార్ పి.జాహ్నవి స్వయంగా పాల్గొని కొలిపించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రమేష్, వీఆర్వో రఘుబాబు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కాలేజి కరస్పాండెంట్ సత్యనారాయణరెడ్డి

నున్న(విజయవాడ రూరల్): ఇంజినీరింగ్ విద్యార్థులకు సాంకేతిక పరమైరన ఈవెంట్స్ కొత్త ఆలోచనలకు ఆవిష్కరింపజేస్తాయని వికాస్ కాలేజి కరస్పాండెంట్ నరెడ్ల సత్యనారాయణరెడ్డి అన్నారు. రెండు రోజుల పాటు నున్న గ్రామంలోని వికాస్ కాలేజీలో జరిగిన వికసిత్ ఫెస్ట్ 2కె23 శనివారం ముగిసింది. ఈ వెంట్స్‌కు జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు టెక్నికల్ ఈవెంట్స్‌లో ప్రదర్శించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు. విజేతలకు కాలేజి కరస్పాండెంట్ ఎన్.సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.రమణ, రామ్మోహనరావు బహుమతులను అందచేశారు.

మత్తు పదార్థాలతో నష్టం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ సౌజన్య

గన్నవరం రూరల్: విద్యార్థులు అవగాహనతో ఉన్నతంగా ఎదగాలని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సౌజన్య సూచించారు. శనివారం నవజీవన్ బాలభవన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై స్క్రీన్ ప్రాజెక్టర్ ద్వారా అవగాహన కార్యక్రమం జరిగింది. జోనల్ కో–ఆర్డినేటర్‌లు కె.ప్రియాంక, డి.శ్రీవల్లి అధ్యక్షతన జరిగిన సభలో ఉపాధ్యాయులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు ఎం.డి బబిత తదితరులు పాల్గొన్నారు.